www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 20 నవంబర్ 2022

వీధి రౌడీలా మాట్లాడడం సిగ్గుచేటు

ప్రజాశక్తి - కడప

కర్నూలు పర్యటనలో చంద్రబాబు వీధి రౌడీలా మాట్లాడ్డం సిగ్గుచేటని ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాష అన్నారు. భవిష్యత్తులో చంద్రబాబు సీమలో అడుగు పెడితే ప్రజలు అడ్డుకుంటారని అన్నారు. శనివారం సాయంత్రం ఉపముఖ్యమంత్రి తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజధాని పోగొట్టుకున్న కర్నూల్ వాసుల గోడు చంద్రబాబుకు పట్టదా అన్నారు. గతంలోలాగా రాష్ట్రం ముక్కలు కాకూడదనే జగన్మోహన్‌రెడ్డి మూడు ప్రాంతాలు అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. రాయలసీమ వాసులు చంద్రబాబుపై ప్రతీకారం తీర్చుకుంటారని తెలిపారు. చంద్రబాబుకు 2024 కాదు 2019 లోనే ఆఖరి ఎన్నికలు అయిపోయాయి అన్నారు. ప్రభుత్వం ప్రతి పక్షాలు ఎన్ని విమర్శలు చేసినా ప్రజలు నమ్మరని, రాబోయే ఎన్నికల్లో వైసిపిని అఖండ మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

రుణాలకు కసరత్తు

- రూ.2 కోట్లతో ఎన్‌హెచ్‌డిఎఫ్‌సి రుణాలు
- ఉభయ జిల్లాల్లో 9,120 మంది గుర్తింపు
- 40 మంది విభిన్నప్రతిభావంతులకు వర్తింపు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జాతీయ విభిన్న ప్రతిభా వంతుల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి సంక్షేమానికి సంబంధించి రుణాల మంజూరుకు కసరత్తు చేస్తోంది. ఎన్‌హెచ్‌డిఎఫ్ కార్పొరేషన్ బృందం జిల్లాలో పర్యటించింది. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన విభిన్న ప్రతిభావంతుల డిపార్టుమెంట్ ఆశావహుల దరఖాస్తులను అందజేసింది. కేంద్ర సామాజిక న్యాయశాఖా మంత్రి నారాయణస్వామి జిల్లా పర్యటనలో భాగంగా రూ.రెండు కోట్లను విడుదల చేయనున్నట్లు ప్రకటించడంతో విభిన్న ప్రతి భా వంతుల్లో కదలిక వచ్చింది. కడప జిల్లాలో 48 వేల మంది, అన్నమయ్య జిల్లాలో 37 మంది చొప్పున 9, 120 మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నట్లు గుర్తించింది. వీరిలో స్వయంశక్తితో ఎదు గుదలను ఆశించిన ఉత్సాహవంతుల గుర్తింపులో భాగంగా కడప జిల్లా నుంచి 20 మంది, అన్న మయ్య జిల్లా నుంచి 20 మంది చొప్పున మొత్తం 40 మందిని విభిన్న ప్రతిభావంతుల శాఖ ఉన్న తాధి కారుల బృందం గుర్తించింది. 2023 జనవరి మాస ంలో ప్రతి అభ్యర్థికి రూ.ఐదు లక్షల చొప్పున 60 నెలల వ్యవధిలో పావలా వడ్డీ ప్రకారం కంతుల వారీగా చెల్లించే ప్రాతిపదికన నిధులను విడుదల చేయనుంది. ఇడిబ్ అనే మరో పథకం కింద అర్హులైన 107 మంది విభిన్నప్రతిభావంతులకు ట్రైసైకిళ్లు, 46 మందికి వీల్ ఛైర్స్, మరో 18 మందికి హియరింగ్ పరికరాలు, వాకింగ్‌స్టిక్స్ మంజూరు చేయనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వెల్ఫేర్ డిపా ర్టు మెంట్ల ద్వారా సంక్షేమ పథకాలు అటకెక్కిన నేప థ్యంలో ఎన్‌హెచ్‌డిఎఫ్ కార్పొరేషన్ ద్వారా నిధుల విడుదల చేయనుండడం ఊరట కలిగించిందనే చెప్పవచ్చు.

నేషనల్ హైవే కోసం అటవీ భూమి పరిశీలన

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

బెంగళూరు - విజయవాడ నేషనల్ హైవే రోడ్డు ఏర్పాటు కోసం శనివారం ఆర్‌అండ్‌బి స్టేట్ చీఫ్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, నేషనల్ హైవే రీజనల్ ఆఫీసర్ రాకేష్ కుమార్ సింగ్, జిల్లా డిఎఫ్ఎస్ఒ సందీప్‌రెడ్డి ఎరసాల నుంచి కలవకుంట్ల వరకు ఉన్న అటవీ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎకనామిక్ కారిడార్ అన్నారు. ప్రస్తుతం బెంగళూరు నుండి విజయవాడకు వెళ్లడానికి 13 గంటల సమయం పడుతుందని, అదే సిక్స్ లైన్ కారిడార్ పూర్తయితే కేవలం 7 గంటల వ్యవధిలోనే చేరుకోవచ్చు అన్నారు. ఈ కారిడార్ ఫారెస్ట్‌కు సంబంధించిన భూములలో సిక్స్ లైన్ రోడ్డు వెళుతుందన్నారు. కాబట్టి ఫారెస్ట్ అధికారులతో సంప్రదించి సమస్యలను తొలగించి సిక్స్ లైన్ రోడ్డును పూర్తిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుంటుందన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి 2023 మార్చి మొదటి వారంలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ ప్రాజెక్టును ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ప్రాజెక్టును మంజూరు చేశారని చెప్పారు. వారి వెంట బద్వేల్ ఆర్డీవో వెంకటరమణ, పోరుమామిళ్ల ఎంపీడీవో నూర్జహాన్ బేగం, తహశీల్దార్ విజయకుమారి, టేకూరుపేట సర్పంచ్ రమణారెడ్డి, రెవెన్యూ, ఫారెస్ట్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ భూమిని పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బి రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

చిల్లర రాజకీయాలకు నిదర్శనం

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాష్ హరికృష్ణ

చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకునేందుకు ప్రయత్నించడం చిల్లర రాజకీయాలకు నిదర్శనమని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ విమర్శించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కర్నూల్ జిల్లా పర్యటనలో ఎక్కడికి వెళ్ళినా ప్రజలు నీరాజనాలు పడుతుండటం, పర్యటన విజయ వంతం కావడంతో వైసిపి నేతలు జీర్ణించుకోలేక చంద్రబాబు కాన్వాయ్‌ని అడ్డుకోవడం దుర్మా ర్గమైన చర్య అని అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వికాస్ హరికృష్ణ మాట్లాడారు. రాయలసీమ ఉద్యమం పేరుతో జగన్, వైసిపి కూలీలు చంద్రబాబు పర్యటనను అడ్డుకు నేందుకు యత్నించడం దారుణమని చెప్పారు. మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టడం వైసిపికే చెల్లిందని తెలిపారు. చిత్తశుద్ధి ఉంటే ఈ మూడు సంవత్సరాలలో రాయలసీమ అభివృద్ధి ఎందుకు చేయలేకపోయారని ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు కడపలో హజ్ హౌస్, పులివెందులకు నీళ్లు, చిత్తూరు జిల్లాలోని తిరుపతిలో శ్రీ సిటీ సెజ్‌లో మొబైల్, పార్మా కంపెనీలు తెప్పించి అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిం దన్నారు. ప్రజలలో వచ్చిన చైతన్యాన్ని పక్కదారి పట్టించేందుకు, దుశ్చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో పార్లమెంట్ మీడియా కో ఆర్డినేటర్ జనార్దన్, ఎస్సీ సెల్ పార్లమెంట్ కార్యదర్శి గడ్డం శ్రీనివాసులు, కడప బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్డయ్య యాదవ్ పాల్గొన్నారు.

ఇంటి వద్దనే వైద్యం

కాశినాయన : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వారి ఇంటి వద్దనే వైద్యం అందిస్తోందని ఇందులో భాగంగా పేదల ఆరోగ్య పరీక్షలు చేసి వారికి ఉచితంగా మందులు అందజేస్తున్నామని వైద్యాధికారి వెంగళరావు పేర్కొన్నారు. శనివారం ఉప్పలూరు, ఓబుళాపురం, రంపాడు గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పేదలు ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. బిపి, షుగర్ వంటి పరీక్షలు అక్కడే చేస్తారన్నారు. ప్రస్తుత సీజనల్‌లో జ్వరం, జలుబు, దగ్గు వస్తున్నాయని, ప్రజలు జాగ్రత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులురెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

చెన్నూరు :జగనన్న కాలనీలలో నిర్మించ తలపెట్టిన పక్కా గృహాల నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడొద్దని హౌసింగ్ పీడీ సుబ్రహ్మణ్యం, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ అన్నారు, శనివారం వారు మండలంలోని కనపర్తి గ్రామ పరిధిలోని గని గుంతలలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు అక్కడి కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ పూర్తి నాణ్యతతో పనులు చేపట్టాలని ఆదేశించారు. బేస్ మట్టాలకు రోజుకు రెండు, మూడు సార్లు నీటిని పటాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అలీ ఖాన్, ఎంపీడీవో జాన్ వెస్లీ, ఇఒపిఆర్‌డి సురేష్ బాబు, పిఆర్ఎఇ మురళి, ట్రాన్స్‌కో ఎఇ రామలింగారెడ్డి, హౌసింగ్ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

కడప అర్బన్ :నగరపాలక సంస్థ కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్ ఆదేశానుసారం స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా శనివారం ఇండోర్ మున్సిపల్ స్టేడియం లో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి వెయ్యి మందికి పైగా విద్యార్థులు పోటీలలో భాగస్వాములయ్యారు. ఇలాంటి పోటీలలో పాల్గొనడం వల్ల పిల్లలలో కళాత్మక మానసిక వికాసం పెంపొ ందుతుందని కమిషనర్ తెలిపారు. కొంతమంది విద్యార్థులు స్వచ్ఛ సర్వేక్షన్, ప్లాస్టిక్ నిషేధం, పలు ఆసక్తికరమైన చిత్రాలను పోటీలలో ప్రదర్శించడం అభినందనీయమన్నారు.

చైల్డ్ లైన్ సే దోస్తీ వారోత్సవాలు



విద్యార్థులతో ఐసిడిఎస్ పీడీ ఎం.ఎస్. రాణి

కడప అర్బన్ : ఆర్తీ విజయ్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైల్డ్ లైన్ 1098 కార్యక్రమంలో పిల్లల దినోత్సవం సందర్భంగా 'చైల్డ్ లైన్ సే దోస్తీ' వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. ఎస్.రాణి హాజరయ్యారు. చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా శనివారం ఆశా నిలయం విభిన్న ప్రతిభావంతులు మూగ, బధిర పిల్లలకు చైల్డ్ లైన్ యూనిసెఫ్ ప్రతినిధి ఇక్రామ్ అలీ ఖాన్ హక్కులను తెలియజేశారు. కార్యక్రమంలో వంద మంది విద్యార్థినీ, విద్యార్థులు, సిస్టర్ జ్యోతిష హెడ్ మినిస్టర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

పోరుమామిళ్లటౌన్ : విద్యార్థులు ఇప్పటి నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథాలయాధికారి అఫ్రిది పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం సందర్భంగా పట్టణంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రముఖ రచయిత, వ్యక్తి వికాస నిపుణులు రంగిసెట్టి కీర్తి కుమార్ రచించిన 'విద్యార్థి తెలుసుకో' అనే పుస్తకాన్ని విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయులు హసన్, గౌస్, షరీఫ్, యూనస్ ఖదీర్, బాల రంగయ్య పాల్గొన్నారు.

రోడ్ల విస్తీర్ణతకు సహకరిస్తాం

కడప అర్బన్: నగరంలో రోడ్ల విస్తీర్ణతకు సహకరిస్తామని మదీనా ఇంజినీరింగ్ కళాశాల అధినేత సయ్యద్ మొహిద్దిన్ బుఖారియా పేర్కొన్నారు. శనివారం హైకోర్టులో ఉన్న కేసును ఉపసంహరించుకున్నట్లు మేయర్ సురేష్ బాబుకు ప్రతులు అందజేశారు. కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్చార్జులు మల్లికార్జున, లక్ష్మయ్య,సుబ్బరాయుడు, త్యాగరాజు, అజ్మతులా పాల్గొన్నారు.

నిత్యాన్వేషణతో ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - కడప

పట్టాలు పొందిన విద్యార్థులతో పోలా భాస్కర్, ప్రిన్సిపల్, సిబ్బంది

విద్యార్థులు నిరంతరం జ్ఞానం కోసం నిత్యాన్వేషణ చేస్తూ ఉన్నత స్థాయి కి ఎదగాలని ఎపి కళాశాలల కమిషనర్ పోల భాస్కర్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి), రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలో తొలిసారిగా పట్టభద్రుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎపి కళాశాల కమిషనర్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో డిగ్రీ పట్టా అందుకోవడం మరపురాని అనుభూతి అని అన్నారు. ఇది మీ జీవితంలో తొలి అడుగు మాత్రమేనని జీవితంలో సాధించాల్సిన లక్ష్యాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. వైవీయూ విసి ఎం. సూర్య కళావతి మాట్లా డుతూ డిగ్రీ పట్టా అం దుకుని బాహ్య ప్రపంచంలోకి వచ్చిన విద్యార్థులందరూ బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని అన్నారు. అనంతరం 2020-21 , 2021-22 విద్యా సంవత్సరాలలో డిగ్రీ, పీజీ పూర్తి చేసుకున్న 55 మంది మెరిట్ విద్యార్థులకు బంగారు పతకాలు బహూకరించగా, మిగతా 250 మందికి డిగ్రీ పట్టాలు ప్రదా నం చేశారు. కార్యక్రమంలో యోగి వేమన యూనివర్సిటీ రిజిస్ట్రార్ విజయ రాఘ వ ప్రసాద్, ప్రొఫెసర్ కె. అనిల్ కుమార్ సింగ్, ఆర్‌జెడి డాక్టర్ డి.నాగలింగా రెడ్డి, సిపిడిసి మెంబర్లు కె. చిన్నప రెడ్డి, పి. వెంకట్రామి రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూరల్ సిఐగా అశోక్‌రెడ్డి

కడప అర్బన్ : కడప రూరల్ సిఐగా అశోక్ రెడ్డి శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన గతంలో చిన్న చౌక్ పోలీస్ స్టేషన్, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలలో వివిధ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వల్లూరు : పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని అంటువ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని గోటూరులో డాక్టర్ ప్రసన్నలక్ష్మితో కలిసి ప్రతి ఇల్లూ తిరిగి నీటి, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యవంతులను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వర్షాలకు పలుచోట్ల వర్షపునీరు ఇళ్ల వద్ద, రోడ్డుపై నిలిచి ఉందన్నారు. దీంతో దోమల ఉత్పత్తి పెరిగి ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగతతో పాటు పరిసరాల శుభ్రత కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్ఓ వేణుగోపాల్ , పీహెచ్ఎన్ నిర్మల, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, సూపర్‌వైజర్ మమత , ఎఎన్ఎం సుజాత, హెల్త్ అసిస్టెంట్ సుబ్బరామయ్య, ఎంఎస్ఓ లక్ష్మయ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు

కలసపాడు :మండలంలోని లింగారెడ్డి పల్లెలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గ్రామ పెద్దలు బాలింతమ్మ ఆలయం వద్ద శనివారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. నల్లగొండ పల్లి వల్లూరి రఘునాథ రెడ్డికి చెందిన ఎద్దులకు ప్రథమ, సియోనుపురంపయ్యావుల లక్ష్మికి చెందిన ఎద్దులకు ద్వితీయ, కలసపాడు, మామిళ్ల పల్లెకు చెందిన ఎదుదలకు తృతీయ బహుమతులు లభించాయి. బహుమతులను సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు బొవిల్ల ఓబుల్‌రెడ్డి అందజేశారు.

రెవెన్యూ ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసలు

కడప : 6వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా పోటీలలో గెలుపొంది విజేతలుగా నిలిచిన జిల్లా రెవెన్యూ క్రీడాకారులన్ను కలెక్టర్ వి.విజయ్ రామరాజు ప్రశంసించారు. శనివారం వారు కల్టెర్‌ను కలిసి తమ విజయోత్సాహాన్ని ఆయనతో పంచుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందిస్తూ జ్ఞాపికలు, క్రీడా సామగ్రి కిట్ తదితర బహుమతులను అందజేశారు. అనంతరం కార్యక్రమంలో ఆర్.జీవన్ చంద్ర శేఖర్, సెక్రెటరీ పి. అలీఖాన్, ఖోశాధికారి కె.పి. రొనాల్డ్ శామ్యూల్ రాజ్ పాల్గొన్నారు.

కెనరా బ్యాంకులో రక్తదానం



రక్తదానాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎం

కడప : కెనరా బ్యాంక్ 117వ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా శనివారం కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాల యంలో రీజనల్ మేనేజర్ మురళీమోహన్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. బ్లడ్ టు లీవ్ సహ కారంతో రిమ్స్ వైద్యుల పర్యవేక్షణలో ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఆర్ఎం తెలిపారు. రక్తదాన శిబిరంలో దాతలు ఇచ్చిన రక్తాన్ని తల సేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు అందజేస్తామని తెలిపారు. రక్తదాన శిబిరంలో 100 మందికి పైగా బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు స్వచ్ఛందంగా పాల్గొని రక్త దానం చేశారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ ఎం. వి. ప్రసాద్, ఎం.వి సాయినాథ్, లీడ్ డిస్టిక్ చీఫ్ మేనేజర్ ఎస్ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

చింతకొమ్మదిన్నె : 55 జాతీయ గ్రంథోత్సవాలు ముగిశాయని గ్రంథాలయ అధికారి ఇబ్రహీం పేర్కొన్నారు, శనివారం స్థానిక గ్రంథాలయంలో భారత తొలి మహిళ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ చిత్రపటానికి మండల అధికారులు నివాళులర్పించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా తహశీల్దార్ గంగయ్య, ఎంపీడీవో రవి కుమార్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అహల్య, హై స్కూల్ ఇన్‌ఛార్జి రత్నమ్మ, మండల విద్యాశాఖ అధికారి వెంకట్రామిరెడ్డి, ఇఒఆర్‌డి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు

చెన్నూరు : రాష్ట్రంలో ప్రతి పక్షాలు, వారి బాధ్యతలు మరిచి ప్రభుత్వంపైనా, వైసిపి నాయకులపైనా నోటికి వచ్చినట్లు బూతులు తిట్టే కార్యక్రమాలు చేపట్టారని, అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారని కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి ఆరోపించారు, శనివారం ఆయన బలసింగాయ పల్లెలో విలేకరుల సమావేశం మాట్లాడుతూ, 48 ఏళ్ల సుదీర్ఘ రాజకీయం కలిగిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మతిస్థిమితం కోల్పోయి ప్రభుత్వంపై దుర్భాషలాడుతున్నారని వాపోయారు. ముఖ్యమంత్రి. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తుంటే, మరో వైపు టిడిపి నాయకులు బూతులు తిట్టడం మొదలుపెట్టారని ఇది పద్ధతి కాదని ఆయన అన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న మహిళలు, అధికారులు

కడప అర్బన్ :మహిళలు, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని గ్రంథాలయ చైర్పర్సన్ ఎల్. ఉషారాణి పిలుపునిచ్చారు. శనివారం గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఇందిరా గాంధీ జయంతిని నగరంలోని ఉర్దూ బాయ్స్ హై స్కూల్‌లో నిర్వహించారు. 'దిశా చట్టం, మహిళా సాధికారత పై చర్చ' కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ చైర్ పర్సన్ ఉషా రాణి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి ఎం.ఎస్.రాణి, దిశ పోలీస్ స్టేషన్, సిఐ లక్ష్మీదేవి, ఎస్ఐ జ్యోతి, దిశా, సఖి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ అశ్విని, జన విజ్ఞాన వేదిక నాయకురాలు, జిల్లా విద్యా కమిటీ కన్వీనర్ రూతు ఆరోగ్యమే, జూనియర్ కాలేజీ లెక్చరర్ కృష్ణవేణి, సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్ రెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఏ డి దేవదత్తం, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్. అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రరీ పవన్, లైబ్రేరియన్లు సుబ్రహ్మణ్యం, జేమ్స్ ,సురేష్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికి మహిళా ఇంజినీర్లు అవసరం

మాట్లాడుతున్న కళాశాల ఎమ్‌డి చంద్ర ఓబుల్‌రెడ్డి

కడప అర్బన్ : దేశానికి మహిళా ఇంజినీర్లు అవసరం ఎంతో ఉందని కెఎస్ఆర్ఎం కళాశాల ఎండి కందుల చంద్ర ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు భయం వీడి తోటి విద్యార్థులతో మమేకం కావాలని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ మాట్లాడుతూ కళాశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యా ర్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ఎంబిఏ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణమోహన్ వివిధ శాఖల అధిపతులు, బోధన బోధన సిబ్బంది పాల్గొన్నారు. **మిషన్ ఆపరేటింగ్ నేర్చుకోవాలి** విద్యార్థులు రోబోటిక్ ఆటోమేటిక్ మిషన్ ఆపరేటింగ్ నేర్చుకోవాలని కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ఎమ్‌డి డాక్టర్ చంద్రఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్మనీ దేశం రోబోటిక్స్ సీనియర్ నిపుణులు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఆన్‌లైన్ విధానంలో తర్ఫీదు ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్ .ఎస్ మూర్తి, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ హేమలత, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ సునీల్ కుమార్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు విద్యార్థులు ఎంపిక

బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయులు

వల్లూరు : జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు వివిధ పాఠశాల నుంచి విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం వనరుల కేంద్రంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్ లో మొదటి స్థానం మోడల్ స్కూల్ చెందిన విద్యార్థులు పల్లవి, వెంకట దివ్య, రెహమాన్, రెండవ స్థానంలో గంగాయపల్లి ఉన్నత పాఠశాల కు చెందిన రేణుక , కీర్తన ,అఖిల్, మూడో స్థానంలో వల్లూరు ఉన్నత పాఠశాలకు చెందిన యోగేశ్వర్ రెడ్డి, మనోజ్ కుమార్, పవన్ కుమార్, విద్యార్థులు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ఎంపికయ్యారు. ఆ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు మధు ,సి.వి సురేంద్ర , వసుంధర విద్యార్థులను అభినందించారు.

'ఎస్‌వి' కళాశాలలో ట్రాఫిక్‌పై అవగాహన

అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపల్, విద్యార్థులు

కడప సిటీ : స్థానిక బాలాజీ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో సిఐ సీతారామిరెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనిఆవరం విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు ముగ్గురిని ఎక్కించుకుని ద్విచక్రవాహనాలు నడపరాదని సూచించారు. దీని వల్ల ప్రమాదాలు వాటిల్లుతాయన్నారు. ప్రస్తుతం విద్యార్థులు సైలెన్సర్ తీసేసి వాహనాలు నడిపితే శబ్దకాలుష్యం వస్తుందని చెప్పారు. ఎస్ఐ ట్రాఫిక్ సిగ్నల్స్ పైన అవగాహన కలిగించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వీర సుదర్శన్ రెడ్డి, విద్యార్థులతోపాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఏడాదీ సన్మానం



మాట్లాడుతున్న అల్‌షిఫా వ్యవస్థాపకులు

కడప అర్బన్ : ప్రపంచ పురుషుల దినోత్సవం పురస్కరించుకుని ప్రతి ఏడాదీ సేవ చేసిన వారిని సన్మానిస్తామని అల్ షిఫా వ్యవస్థాపకులు ఎస్ఎండి రఫీ పేర్కొన్నారు. శనివారం హౌస్ బిల్డింగ్ సొసైటీ సమావేశ మందిరంలో ప్రపంచ పురుషుల దినోత్సవం నిర్వ హించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వివిధ రకాల వర్గాల వారికి పురుషులు అనేక సేవా కార్యక్రమాలను చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం, దాతలు ప్రోత్సహిస్తే మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పురుషుల దినోత్సవం రోజు సేవా తత్పరులను మహిళలు సన్మానించడం సంతోషంగా ఉంద న్నారు. కార్యక్రమంలో అబ్దుల్ కలాం సేవా సమితి వ్యవస్థాపకులు పఠాన్ తౌహీద్ ఖాన్, న్యాయవాది ఉదయశ్రీ, పర్వీన్ నాజ్, ఎస్ఎండి తాహిర్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

23 నుంచి అండర్-19 బాలికల ఎస్‌జిఎఫ్ పోటీలు

కడప : ఈ నెల 23 నుంచి అండర్-19 బాలికల ఎస్‌జిఎఫ్ పోటీలు నిర్వహించనున్నట్లు అండర్-19 ఎస్‌జిఎఫ్ సెక్రటరి శారద తెలిపారు. శనివారం అండర్-19 బాలికల ఎస్‌జిఎఫ్ సెలెక్షన్స్‌కు సంబంధించి సమావేశం డివిఇఒ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐఒ రవి నిర్వహించారు. అండర్-19 బాలికల ఎస్‌జిఎఫ్ సెక్రటరిగా శారదను ఎన్నుకున్నారు.

'పిడిఎఫ్' పోరాట ఫలితమే జీవో 180 విడుదల

కడప అర్బన్ : పిడిఎఫ్ ఎంఎల్‌సిలు, యుటిఎఫ్ నాయకులు పోరాట ఫలితంగానే సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారాలు బదలాయించేందుకు సంబంధించిన జీవో 180 విడుదలైందని జిల్లా మున్సిపల్ సబ్ కమిటీ కన్వీనర్ రూతు ఆరోగ్యమేరి తెలిపారు. శనివారం యుటిఎఫ్ భవన్ లో మున్సిపల్ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం మున్సిపల్ విద్యా వ్యవస్థను గాడిలో పెట్టడానికి అనేక పోరాటాలు చేశారన్నారు. విద్యాశాఖ అధికారుల సహకారంతో జీవో తేవడంలో విజయం సాధించారని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పట్ల ఎప్పటికప్పుడూ ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ ముందుంటుందని చెప్పారు. మున్సిపల్ ఉపా ధ్యాయుల ందరూ యూటీఎఫ్, పిడిఎఫ్ ఎమ్మెల్సీల కృషికి రుణపడి ఉంటారని తెలి పారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, నాయకులు సునీల్, కిరణ్ కుమార్, శివశంకర్, జావేద్, సివి రమణ, దేవత్తం పాల్గొన్నారు. **ఎస్‌టియు హర్షం..** ఉపాధ్యాయుల చిరకాల కోరిక నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి , జిల్లా అధ్యక్షులు పీవీ సుబ్బారెడ్డి ప్రధాన కార్యదర్శి ఎన్ వి సుబ్బారెడ్డి ఆర్థిక కార్యదర్శి భోగా వెంకటసుబ్బయ్య హర్షం వ్యక్తం చేశారు.

ఆదర్శ మహిళ ఇందిరమ్మ

ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప : మాజీ ప్రధాని ఇందిరమ్మ ఆదర్శ మహిళ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఓల్డ్ రిమ్స్ వద్ద ఉన్న ఇందిరమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పిసిసి డెలికేట్ బండి జకరయ్య మాట్లాడారు. ఇందిరాగాంధీ పేద బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు కృషి చేశార న్నారు. కార్యక్రమంలో తిరుమలేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్యామలాదేవి, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య, బీసీ సెల్ జిల్లా చైర్మన్ నూకల చిన్న కులయప్ప, బీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీనివాసులు, మైనార్టీ నగర అధ్యక్షుడు ఆసిఫ్ ఖాన్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఆనంద్, బీసీ నగర అధ్యక్షుడు వేణుగోపాల్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, జిల్లా కార్యదర్శి సాదిక్ అలీ, బీసీ నేతలు ఎరికలయ్య, ప్రసాద్ ,సూర్యుడు, అరుణ, అలెక్స్ సురేష్, పాల్గొన్నారు. **చెన్నూరు :** మండలంలోని కొండపేట హైస్కూల్‌లో హెచ్ఎం ఉమా మహేశ్వరి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆమె ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. గ్రంథాలయ వారోత్సవాల సంద ర్భంగా నిర్వహించిన పోటీ పరీక్షలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథా లయంలో సభ్య త్వం తీసుకున్న 20 మంది విద్యార్థులను ప్రశంసించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జి.రాజ్‌కుమార్, పుస్తక నిక్షిప్త కేంద్ర నిర్వాహకురాలు జి.అరుణ పాల్గొన్నారు.

ధర్మాగ్రహం

ప్రజాదృష్టి

జిల్లాలో ఎపి రైతు సంఘం రెండ్రోజుల శిక్షణా తరగతుల్లో భాగంగా నిర్వహించిన సెమినార్‌కు హాజరైన రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, మాజీ కార్యదర్శులు ప్రసంగాలు ఆలోచింపజేశాయి. కడప జిల్లా వ్యవసాయాధారితమైన జిల్లా కావడం తెలిసిందే. జిల్లాలో దేశంలో వ్యవసాయ రంగ సంక్షోభం.. పరిష్కారమార్గాలు, వ్యవసాయ బోర్లకు మీటర్లు-రైతులపై ప్రభావం, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు పాలకుల వైఖరి అనే అంశాలపై రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, మాజీ ఉపాధ్యక్షులు, మాజీ కార్యదర్శుల ప్రసంగంలో వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించడం వల్ల వాటిల్లే అనర్థాల గురించి గుదిగుచ్చినట్లు వివరించడం రైతులను ఆలోచనలో పడేసింది. జిల్లాలో 1.50 వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగిస్తే ఉచిత విద్యుత్ అమలు డోలాయమానంలో పడుతుందని హెచ్చరించారు. వ్యవసాయాధారిత జిల్లాలో ఇటువంటి సెమినార్ నిర్వహించడం సందర్భో చితంగా ఉందని చెప్పవచ్చు. జిల్లాలో కెసి కెనాల్ మినహా ఎటు వంటి సాగునీటి వనరులు కరువైన నేపథ్యంలో వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించడం వల్ల మొబైల్, కేబుల్ టీవీ కనెక్షన్ల తరహాలో ఖాతాల్లో నగదు ఉన్నంత వరకు విద్యుత్ సరఫరా అవుతుందని, అనంతరం ఆటోడెబిట్ విధానంతో సరఫరా ఆగిపోతుందని సోదా హరణంగా వివరించడంలో జయప్రదం కావడం గమనార్హం. రాజకీయ పార్టీల గుప్పిట నుంచి రైతాంగం బయటపడితేనే వ్యవ సాయ సంక్షోభానికి దారి తీస్తున్న విధానాలను గమనించే అవకాశం ఉందన్నారు. పారిశ్రామికులు తమ ఉత్పత్తులకు ధరలు నిర్ణయించు కుని విపణిలో విక్రయించి సొమ్ము చేసుకునే తరహాలో రైతులు తమ ఉత్పత్తులకు సైతం రైతులే ధరలు నిర్ణయించుకునే దశకు చేరుకోవాల్సి ఉందని ప్రసంగీకులు చైతన్యపరిచారు. ఇటువంటి దశకు చేరుకుంటే దళారుల పాత్ర గణనీయంగా తగ్గుతుందని, ఫలితంగా రైతులకు లబ్ధి చేకూరుతుందని వివరించడం ఆకట్టుకుంది. వ్యవసాయరంగ సంక్షోభానికి కారణం పాలకులు అనుసరిస్తున్న దివాళాకోరు విధానాలే కారణమని వివరించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయానికి వస్తే తెలుగుగంగ ప్రాజెక్టు 40 ఏళ్లుగా సాగుతూనే ఉందని, కేటాయింపులు మాత్రం వందల కోట్ల నుంచి వేల కోట్లకు చేరుకుంటోందని హెచ్చరించారు. ఏటా రూ.ఐదు వేల కోట్ల కేటాయింపుల్లో ఆచరణలో సగానికి సైతం ఖర్చు చేయడం లేదని, ఇటువంటి తరహా విధానాలతో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే కుట్రకు అవకాశం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో కరెంటుకాటు బారినపడి మృతి చెందుతున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. కరెంటు కాటు బారిన పడటానికి విద్యుత్ యంత్రాంగం నిర్లక్ష్యాన్ని గర్హించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఐదేళ్లలో వందల సంఖ్యలో మృత్యువాత పడుతుండడం మానవ తప్పిదం. ఇటువంటి పొరపాట్లను ట్రాన్స్‌కో యంత్రాంగం అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వం విత్తనం నుంచి విక్రయం వరకు ఆర్బీకేల పరిధిలో చేస్తున్నామని చెబుతోంది. టమోటా ఉత్పత్తులను రైతుల పొలాల్లోనే వదిలివెళ్తున్న నేపథ్యం పాలకులు చెబుతున్న మాటలకు..క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన కుదరడం లేదు. ప్రొద్దుటూరు మార్కెట్ సముదాయ శంకుస్థాపనకు పెద్దఎత్తున శ్రీకారం చుట్టారు. ఒక శంకుస్థాపనకు రూ.కోటి వరకు ఖర్చు చేయడం పట్ల విమర్శలు వ్యక్తమ వుతున్నాయి. ప్రొద్దుటూరుకు పొరుగు మండలమైన చాపాడులో నలుగురు రైతులు కరెంటు కాటుకు గురై మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోని ఇటు వంటి బాధిత కుటుంబాలకు ఆసొమ్ములో కొంత మొత్తాన్ని సాయం రూపంలో అందించి ఉంటే రాజకీయ ప్రయోజనం చేకూరడంతో పాటు ఉత్తమ సంప్రదాయం, దాతృత్వాలకు చిరుమానా చేకూరి ఉం డేదని ఘంటాపథంగా చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

దుమ్ము తొలగించాలని నిరసన

ప్రజాశక్తి - వేంపల్లె

రోడ్లపై ఎక్కువగా దుమ్ము ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, దీన్ని తొలగించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్ డిమాండ్ చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో శనివారం దుమ్మును తొలగించాలని ఆమ్‌అద్మీ పార్టీ ఆధ్వర్యంలో రోడ్డుపై నీటిని చల్లి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప - రాయచోటి-పులివెందుల రోడ్లల్లో దుమ్ము ఎక్కువగా ఉందన్నారు. వాహనాలు వెళ్లే సమయంలో ప్రజలు చాల అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లుపై ఉన్న దుమ్ము తొలగించాలని అధికారులను ఎన్నోసార్లు కోరినా ఫలితం లేదని వాపోయారు. దుమ్ము వల్ల ప్రజలు, వ్యాపారస్తులు పలు రోగాల బారిన పడుతున్నట్లు తెలిపారు. రోడ్లుపై ఉన్న కాగితాలను మాత్రమే నామ మాత్రంగా పంచాయతీ కార్మికులు తొలగిస్తున్నారని పేర్కొన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగు కాలువలు కూడా చెత్తతో నిండి పోయాయని తెలిపారు. రోడ్లుపై కుళ్ళిన కూరగాయలు వేస్తుండడంతో పశువులు రోడ్లపై అడ్డంగా నిలబడుతున్నట్లు చెప్పారు. పశువులు రోడ్లపై గుంపులుగా చేరడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఆమ్‌అద్మీ పార్టీ నాయకులు అబ్దుల్ రజాక్, సలీం, ఫీరుబాషా, ఫయాజ్ పాల్గొన్నారు.

నీళ్లు చల్లుతూ నిరసన వ్యక్తం చేస్తున్న ఆప్ నాయకులు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎస్ఎల్ఆర్ హాస్పిటల్ వైద్యులు రామ అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. పట్టణ పరిధిలోని విఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నేషనల్ ఇంటిగ్రేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రధానిగా రాణించిన ఇందిరా గాంధీ నేటి యువతకు ఆదర్శమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరనేదానికి ఇందిరాగాంధీ నిదర్శనమన్నారు. విద్యార్థి దశ నుంచే దేశభక్తి, సమాజం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. విఆర్ కాలేజి కరస్పాండెంట్ ఎస్.వెంకటరాముడు, జెవివి సీనియర్ నాయకులు ఖాజా హుసెన్, అమ్మ సేవాసమితి అధ్యక్షులు శివశంకర్, సతీష్, అధ్యాపకులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న వెంకట రాముడు

పోటీ పరీక్షలతో జ్ఞానం పెరుగుతుంది

- బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పోటీ పరీక్షల వల్ల విద్యార్థుల్లో జ్ఞానం పెరుగుతుందని బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక బాలాజీ హైస్కూల్‌లో చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో మండల స్థాయిలో బహుమతి పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక వారు ప్రతి సంవత్సరం చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నారని, దాన్ని సద్వినియోగం చేసుకోవడంలో మన పాఠశాల విద్యార్థులు ఎప్పుడూ ముందుంటారన్నారు. మూఢనమ్మకాల నుంచి బయట పడడానికి, సైన్స్‌ను నమ్మేలా చెకుముకి పరీక్షలు ఉంటాయన్నారు. ప్రతి విద్యార్థి పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయికి ఎంపికైన 10వ తరగతి విద్యార్థినులు భూలక్ష్మి, పూజిత, 8వ తరగతి విద్యార్థి వెంకటేశ్వరరెడ్డిని పాఠశాల ఎఒ ప్రసాద్‌రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయుడు ఖాసీం, ప్రధానోపాధ్యాయురాలు సూర్యమిత్ర అభినందించారు.

మెమొంటో, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థకు అవార్డు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు ఆదరణ సేవా సంస్థకు శనివారం కడప పట్టణానికి చెందిన యస్ఆర్‌పి ఫౌండేషన్, మీకోసం సేవా సంస్థ, అల్పిఫా సేవా సంస్థ, అబ్దుల్‌కలాం సేవా సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవార్డు ప్రదానం చేశారు. జిల్లాలోని పలు స్వచ్ఛంద సేవాసంస్థల నిర్వాహకులకు ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆదరణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ స్థానిక విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ ఈ అవార్డు సంస్థలోని సభ్యులకందరికీ చెందుతుందన్నారు. ఇందుకు కారకులైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సుబ్రహ్మణ్యం, సాయి, మల్లికార్జున, అమరావతి, శ్రీకాంత్, మాధం పాల్గొన్నారు.

అవార్డును అందుకుంటున్న బైసాని సత్యనారాయణ

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

ప్రజాశక్తి - ఖాజీపేట

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పథక డైరెక్టర్ రాణి పేర్కొన్నారు. మండలం పరిధిలోని పేరారెడ్డి కొట్టాలు వద్దనున్న ఆదర్శ పాఠశాలలో శనివారం శ్రీ గాయత్రి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాణి మాట్లాడుతూ బాలల హక్కులకు ఎక్కడైనా భంగం కలిగితే తమ దృష్టికి తేవాలన్నారు. బాల్యవివాహల సమాచారం ఉంటే చైల్డ్ లైన్ 1098 గానీ, పోలీస్ హెల్ప్‌లైన్ 100కిగానీ ఫోన్ చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాలు నియంత్రణ సంప్రదించాల్సిన అత్యవర ఫోన్ నంబర్స్ గల స్టిక్కర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపా ధ్యాయులు, గాయత్రి ట్రస్ట్ సభ్యులు నిగినే వెంకటేష్, సుబ్బయ్య, నారాయణ, స్వర్ణలక్ష్మి పాల్గొన్నారు.

స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

- జమ్మలమడుగు డిఎస్‌పి నాగరాజు

ప్రజాశక్తి - మైలవరం

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని జమ్మలమడుగు డిఎస్‌పి నాగరాజు సిబ్బందిని ఆదేశించారు. మైలవరం పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. రికార్డులో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ పరిధిలోని మహిళా జిఎంఎస్‌కెలతో నిర్వహించిన సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఉంటే వెంటనే స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. అనంతరం ఎస్ఐకి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జమ్మలమడుగు రూరల్ సిఐ టివి కొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'సీమ' ద్రోహి ఎవరో ప్రజలకు తెలుసు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

రాయలసీమ ద్రోహి ఎవరనేది సీమ ప్రజలకు బాగా తెలుసునని మైదుకూరు ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి పేర్కొన్నారు. ప్రొద్దుటూరులోని తన నివాసంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్ర బాబు మానసిక పరిస్థితి బాగా లేదన్నారు. కర్నూలు పర్యటనలో వీధి రౌడీలా ఆయన మాట్లాడిన తీరు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి ఎంతో రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నోటికి వచ్చినట్లు మాట్లాడడం సబబు కాదన్నారు. కర్నూలులో హైకోర్టు కావాలని ప్రజలు ఆశిస్తున్నారన్నారు. అందుకు అనుగుణంగా స్వచ్ఛందంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారన్నారు. చంద్రబాబుది పూర్తిగా మొసలి కన్నీరు అన్నది ప్రజలందరికీ అర్థమవుతోందన్నారు. ఆయన హయాంలో రాయలసీమకు ఏం చేశారన్నది వివరించాలన్నారు. మూడేళ్ల జగన్ పాలనలో నీటి ప్రాజెక్టులన్నీ నిండాయని తెలిపారు. గతంలో వైఎస్సార్ కూడా గాలేరు, హంద్రీ-నీవా వంటి ప్రాజెక్టులను జలయజ్ఞం పేరుతో అభివృద్ధి చేశారన్నారు. ప్రస్తుతం బ్రహ్మసాగర్ 17 టిఎంసికి నీరు నిలువకు అవకాశం ఏర్పడిందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కెసి కెనాల్‌కు నీరు అడగకుండానే సమయానికి అందజేయగలుగుతున్నామన్నారు. అభివృద్ధి చేసి ఉంటే కుప్పంలో ఘోర పరాభవం ఎందుకు ఎదురవుతుందో చంద్రబాబు చెప్పాలన్నారు. ప్రస్తుతం జనసేనపై ఆధారపడి చంద్రబాబు ఉన్నారన్నారు. బిజెపి, జనసేన పొత్తు పెట్టుకోవడంతో చంద్రబాబు మతిభ్రమించిందని ఆయన విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో 175 స్థానాలు వైసిపి కైవసం అవుతాయన్నారు. ఎంపిపి టి.లక్ష్మమయ్య, తిప్పిరెడ్డిపల్లె వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

సిఎంపై బాబు చేసిన వ్యాఖ్యలు అర్థరహితం

పులివెందుల రూరల్ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మూడు రోజులు కర్నూలు జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి సిఎం జగన్ పై చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని పురపాలక చైర్మన్ వల్లపు వరప్రసాద్, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి. వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణస్వామి పేర్కొన్నారు. స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాబు పర్యటనలో ఆయన మాట్లాడడం చూస్తుంటే మతిస్థిమితం కోల్పోయినట్లుందన్నారు. సభ్యత సంస్కారం లేకుండా వైఎస్, సిఎం జగన్ గురించి మాట్లాడడం సబబు కాదన్నారు. అమరావతిలో పచ్చని పంట పొలాలను నాశనం చేసిన వ్యక్తి చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. బాబు పాలనలో టిట్కో ఇళ్లల్లో, నీరు-చెట్టు కార్యక్రమంలో ఎంతో అవినీతి జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, ఖాదర్, అంక్కాలమ్మ గుడి చైర్మన్ ప్రసాద్, సిద్దయ్య, వీర, వైసిపి విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి జస్వంత్‌రెడ్డి, విద్యార్థి విభాగం నాయకులు మహి, యోహాన్ ఉన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్‌కే సాధ్యం : పిసిసి

ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి, నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర, రాష్ట్రాల్లో ఇందిరమ్మ రాజ్యం కావాలంటే కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి పేర్కొన్నారు. భారత మాజీ ప్రధాని ఇందిరమ్మ 105వ జయంతి సందర్భంగా శనివారం ఆమె చిత్రపటానికి తులసిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిజెపి రాజ్యం ఇంటింటా మోసం, వైసిపి రాజ్యం ఇంటింటా దౌర్జన్యం అనేరీతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. ఇంటింటా సౌభాగ్యం వెల్లి విరియాలంటే మళ్ళీ ఇందిరమ్మ రాజ్యం రావాలని అన్నారు. ఇందిరాగాంధీ ఏడేళ్లపాటు భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా పార్టీ ప్రతిష్టకు కృషి చేశారన్నారు. పదహారేళ్లు దేశ ప్రధానిగా సేవలు అందించి భారతదేశాన్ని అగ్ర దేశాల సరసన నిలబెట్టారన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రావాలంటే కాంగ్రెస్ శ్రేణులు పట్టుదల, పౌరుషం, అంకితభావంతో కలిసి పని చేయాలని తులసిరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, చెన్నకేశవ, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ధృవమార్ రెడ్డి, ఉత్తన్న, శివ, బద్రి, రాఘవయ్య, రామయ్య, వెంకటేశు, ఈశ్వరయ్య, పాల్గొన్నారు.

- భారత తొలి మహిళా ప్రధాని ఇంది రమ్మను విద్యార్థినులు ఆద ర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సి పల్ డాక్టర్ యోగాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్ఆర్ వివేకా నంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా ఇందిరమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, ఎన్‌వైకె కో- ఆర్డినేటర్ సుబ్బయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిఒ 163 తేవడం దారుణం : జెఎసి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

జిఒ 163 ద్వారా నెల్లూరు నుంచి ఆర్‌టిపిపికి పర్మినెంట్ ఉద్యోగులుగా 39మందిని తేవడం దారుణమని ఆర్‌టిపిపి రీజినల్ జెఎసి పేర్కొంది. జెఎసి ఆధ్వర్యంలో శనివారం విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, భూనిర్వాసితులు ఆర్‌టిపిపి మెయిన్ గేట్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇక్కడి కాంటాక్ట్ కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. వారిని పర్మినెంట్ చేయకుండా బయట వ్యక్తులను తీసుకరావడం పట్ల ప్రభుత్వం, యాజమాన్యం వ్యవహరించిన తీరు చాలా దారుణమన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని నాయకులు తెలిపారు. వీరికి రాయలసీమ విమోచన సమితి నాయకులు, ఆర్‌టిపిపిలోని అన్ని ఉద్యోగ సంఘాలు మద్దతు తెలిపాయి. కార్యక్రమాన్ని విజయవంతం చేసి అన్ని ఉద్యోగ సంఘ నాయకులకు, కాంట్రాక్టు కార్మికులకు రీజినల్ జెఎసి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

గేట్ సమావేశంలో కాంట్రాక్టు కార్మికులు, రీజినల్ జెఎసి నాయకులు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంఇఒ, జడ్‌పిటిసి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో వారోత్సవ ముగింపు వేడుకలను శనివారం గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఉమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఇఒ సుబ్బారావు, జడ్‌పిటిసి బాలయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. 6 రోజులలో నిర్వహించిన పోటీ కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు, కృష్ణ చైతన్య పాఠశాల కరెస్పాండంట్ రామమోహన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చాపాడు : 55 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయ అధికారి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో శనివారం ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ రవిశంకర్ బహుమతులు అందజేశారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ గ్రంథాలయాలను నిత్యం సం దర్శిస్తూ పుస్తక పఠనాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు ప్రసన్నలక్ష్మి, రామసుభాషిణి, సచివాలయ ఉద్యోగులు సరిత, ఆఫ్రిన్, చాపాడు ఉప సర్పంచ్ విజయకుమార్‌రెడ్డి, బిడిసిలు రవిశంకర్ రెడ్డి, భైరవుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇదురు బాషా, బాల గంగాధర్‌రెడ్డి సూచించారు. స్థానిక పిఆర్ హైస్కూల్‌లో శనివారం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, అడిషనల్ ఎస్‌పి బి.ఉమామహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు వారు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు జగనన్న గోరుముద్దను సక్రమంగా అమలు చేస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను, భోజనశాలలను, వంట గదిని, బాత్రూంలను పరిశీలించారు. పాఠశాల వసతులను ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. ముందుగా వీరికి ఎంఇఒ క్రిష్టఫర్, ప్రధానోపాధ్యాయులు పాఠశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

వంటశాలలో కోడిగుడ్లను పరిశీలిస్తున్న అధికారులు

ఎంబిఎ ఫలితాల్లో సిబిఐటి విద్యార్థుల ప్రతిభ

చాపాడు : జెఎన్‌టియు అనంతపురం విడుదల చేసిన ఎంబిఎ ఫైనల్ ఇయర్ 4వ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో సిబిఐటి ఇంజనీరింగ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి వంద శాతం ఉత్తీర్ణత సాధించారని కరస్పాండెంట్ డాక్టర్ జయచంద్రారెడ్డి తెలిపారు.

గాంధీపార్కు పనులు ముమ్మరం : ఎమ్మెల్యే

పార్కులోని ఊయలలో ఎమ్మెల్యే రాచమల్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వచ్చే సంవత్సరం ఫిబ్రవరి నాటికి మున్సిపల్ గాంధీ పార్కును అందుబాటులోకి తేనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాదరెడ్డి తెలిపారు. ఆ మేరకు నిర్మాణ పనులను వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. నిర్మాణదశలో ఉన్న మున్సిపల్ గాంధీ పార్కును శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో పట్టణ వాసులకు ఆహ్లాదాన్ని, విశ్రాంతిని అందించటానికి నాడు నెలకొల్పిన గాంధీ మున్సిపల్ పార్కు శిథిలావస్థకు చేరుకుందన్నారు. దాదాపు రూ.2కోట్ల57లక్షలతో పార్కు నిర్మాణపనులు వేగవంతంగా చేపట్టామన్నారు. నూతన హంగులతో ప్రజలకు అందుబాటులోకి తేనున్నామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో గాంధీ పార్కు దెబ్బతిని, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. నేడు వైసిపి ప్రభుత్వ హయాంలో అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. పిల్లల ఆటపాటలకు ప్రాధాన్యత కల్పిస్తూ వారికి 12 రకాల ఆటవస్తువులు, పెద్దలకు విశ్రాంతి కోసం నీడనిచ్చే చెట్లు, చిన్నపాటి శుభకార్యాలు చేసుకునేందుకు ఓపెన్ ఎయిర్ ఫంక్షన్ హాలు, యువత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించేందుకు జిమ్, వాకింగ్ ట్రాక్, రాతితో నిర్మించిన మందిరాలు, నిలువెత్తు గాంధీ విగ్రహం, శుచి శుభ్రతలతో ప్రొద్దుటూరు కేఫ్ పేరిట హోటల్, యోగా సెంటర్ సౌకర్యాలు కల్పించనున్నట్లు రాచమల్లు తెలిపారు.

అవగాహనతో ఎయిడ్స్ నివారణ

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో మైదుకూరులోని పశువుల సంతలో శనివారం కళాజాత బృందాల ద్వారా అవగాహన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాజాత సభ్యులు నటరాజ్ మాట్లాడుతూ హెచ్ఐవి నివారణ అవగాహనతోనే సాధ్యమవుతుందన్నారు. హెచ్ఐవి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ మార్గాలపై పాటల రూపంలో వివరించారు. పశువుల సంతకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. టోల్ ఫ్రీ నెంబర్ 1097 సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2017 హెచ్ఐవి యాక్ట్ గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ ప్రసాద్, సూపర్వైజర్ దర్బార్, కళా బృందం సభ్యులు సుధాకర్, వీరాస్వామి, ప్రశాంత్, సావిత్రమ్మ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు తొలగింపు

ప్రజాశక్తి - లింగాల

పులివెందుల-అనంతపురం డబుల్ రోడ్డులో ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగిస్తున్నారు. చిన్న కుడాల వద్ద నుంచి పార్నపల్లి వరకు మూడు బుల్డోజర్లతో తొలగిస్తున్నారు. అధిక వర్షాలు వల్ల దారి పొడవునా గడ్డి, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. రాత్రి పూట ద్విచక్ర వాహనదారులు వెళుతుంటే పొలంలో నుంచి అడవి జంతువులు రోడ్ల మీదకి వస్తున్నాయి. వాటి వల్ల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు దాదాపు 30 కిలోమీటర్ల మేర రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలను, గడ్డిని తొలగించే చర్యలు చేపట్టారు.

పిచ్చి మొక్కలను తొలగిస్తున్న బుల్డోజర్

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాని నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. విజయవాడలోని టిడిపి జాతీయ కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్టేట్ జనరల్ బాడీ సమాశానికి జమ్మల మడుగు ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి, ఎమ్మెల్సీ చదిపిరాళ్ల శివనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సం దర్భంగా నియోజకవర్గ పరిస్థితుల గురించి వారిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యకర్తలకు మరింత అండగా ఉండి పార్టీని ముందుకు తీసుకుపోవాలని సూచించారు. రాష్ట్ర కమిటీ ఇచ్చే ఆదేశాలను ఏమాత్రం అలసత్వం లేకుండా వెంటనే అమలుపరచాలని తెలిపారు. జమ్మలమడుగు నుంచి టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, టిడిపి నాయకులు రాయల్ కిరణ్ పాల్గొన్నారు.

సోమిరెడ్డితో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పెద్దముడియం

లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పెద్ద పసుపుల గ్రామంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వ హించారు. కార్యక్రమాన్ని వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. సమా వేశంలో లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకొని, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటరమణయ్య, తహశీల్దార్, హౌసింగ్ ఎఇ సుబ్బరాయుడు, ఎపిఎం వెంకటసుబ్బయ్య, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, గ్రామ రెవెన్యూ అధికారి అంజనమ్మ, వాలంటీర్లు, లబ్ధిదారులు పాలొన్నారు.

అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ ఎఇ సుబ్బరాయుడు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మండల పరిధిలోని నల్లపరెడ్డిపల్లె గ్రామంలో శనివారం రాజమండ్రికి చెందిన రవి (22) అనే యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. కొంతమంది యువకులు పనులు చేసుకుంటూ కడప, ప్రొద్దుటూరు, బద్వేల్ ప్రాంతాల్లో కేబుల్ వైర్లు లాగుతున్నారు. అందులో భాగంగా నాలుగైదు రోజుల నుంచి నల్లపురెడ్డిపల్లి గ్రామంలో ఫైబర్ నెట్ కేబుల్ వైర్లు లాగుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ వైర్ చేతికి తాకడంతో రవి అక్కడికక్కడ మృతి చెందాడు. మృతదేహాన్ని పులివెందుల ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన రవి

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE COURT KADAPA.

O.S.NO. 1193/2019

1.Chittepu Lakshmi Reddy, son of late C.Narapu Reddy, aged 71 years, Hindu, Business.
2.Chittepu Venkata Mohan Reddy, son of C.Lakshmi Reddy, aged 40 years, Hindu, Business.
3.Chittepu Venkata Madhusudhan Reddy, Son of C. Lakshmi Reddy, aged 37 years, Hindu, Doctor, All are residents of Door No.1/1762-2, Gandhi Nagar, Yerramukkapalle, Kadapa City, YSR Kadapa District. **...Plaintiffs**

Vs

Patan Ayub Khan, son of Patan Abdulla Khan, aged about 58 years, Muslim, Business,residing at Door No.11/79, Thotapalem Street, Nandalur Town, YSR Kadapa District. **...Defendant**

NOTICE TO DEFENDANT

ఇందుమూలముగా ప్రతివాది అయిన నీకు పై దావాలో తెలియజేయడం ఏమనగా వాది నీపై దావా దాఖలా చేసి యున్నారు. సదరు దావా నీ నోటీసుకు గాను 7/12/2022వ తేదీన వాయిదా వున్నది. కావున నీవు 7/12/2022వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై తెలిపిన కోర్టు నందు స్వయముగ గాని లేక వకీలు ద్వారా గానీ హాజరై ఎటువంటి ఆక్షేపణలు వున్నయెడల తెలుపుకొనవలెను. లేనిచో రాజశ్రీ కోర్టు వారు నీపై పరోక్షముగా తీర్మానించబడును.

//By Order Of the Court//

S.S.D.RAMASWAMY,
Advocate, KADAPA.
Cell: 98494 10091.

IN THE COURT OF THE HON'BLE IInd ADDITIONAL JUNIOR CIVIL JUDGE, KADAPA.

O.S. NO. 1094/2019

Sadhu Reddepa Reddy, S/o. Sadhu Venkata Reddy, Hindu,Aged 66 years, Business, resident of D.No. 8/75,Rajula Colony, Chennamukkapalli Post, Rayachoti Town & Mandal,YSR Kadapa District. **...Plaintiff**

Vs

R. Sreenivasulu Reddy, S/o. R.V.S. Reddy, Hindu, aged about 48 years,Business, resident of D.No. 20/909, Radhakrishna Nagar,Cooperative Colony, Kadapa City 8& District. **...Defendant**

ప్రతివాది పరము కోర్టు నోటీసు

పైన తెలిపిన దావాలో వాది తనకు ప్రతివాది నుండి రావలసిన దావా మొత్తము గురించి ప్రతివాది పైన దాఖలు చేసిన పై దావాలో ప్రతివాదికి ఇంత వరకు కోర్టు సమన్లు ముట్టనందున రాజశ్రీ కోర్టు వారు ప్రతివాది మహారాజశ్రీ కోర్టులో హాజరు గురించి దినపత్రికలో ప్రచురించవలెనని ఉత్తర్వులు పాలించియున్నారు. కావున పై దావాలో ప్రతివాది నవంబరు నెల 30వ తేదీన ఉదయము 10.30 గం.లకు వ్యక్తిగతంగా గాని, వకీలు ద్వారా గాని మహారాజశ్రీ కోర్టులో హాజరై వాది తనపైన వేసిన దావా గురించి ఏమైనా అభ్యంతరాలు వుంటే తెలుపుకొనవచ్చును. లేనింతట ప్రతివాదిపై పరోక్షంగా కోర్టు వారు దావా తీర్మానం చేయుదురు.

(కోర్టు ఉత్తర్వు ప్రకారం ప్రచురించడమైనది)

T.S.RANGANAYAKULU,
B.A., L.L.B.,
వాదిపరం న్యాయవాది, కడప.